# కూలీల బ్రతుకులు ::

రచన:
శ్రీ పట్టెల కృష్ణమూర్తి

ఎందుకో జనసందోహం ముందుకు నడుస్తూంది. ప్రతివాడి ముఖంలోను ఏదో ఆవేదన, ఆత్రుత తొంగి చూస్తున్నాయ్!'' జలా జలా ప్రవహించే వర్షాకాలపు సెలయేరులా వుందా జనసందోహం. ప్రతిమలుపులోను కూలీలు కలుస్తున్నారు. ఏమిటి??? ఎందుకు?? అనకండానే ముందుపొయ్యే యుదకుల్ని అనుసరిస్తున్నారు. క్వారీలో కదిలే కంకరరాళ్లులా వుంది ఆజన సందోహం - ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ పర్వతపు అంచులపై కట్టబడ్డ సుందరమయిన భవనంలోంచి చూస్తున్న శేఖరానికి. లల్లాయి పదాలుపాడుతూ జీవిత మంతావృధాగా వ్యర్ధంగా - యిదే ఐశ్వర్యం ఆనందం ఎప్పుడూ తనకోసమే జన్మతీసుకున్నట్లుగా భావించే 'రమ' కివన్నీ చూచేందుకు తీరికేలేదు. కాని కంట్రాక్టరు కామేశానికి మాత్రం యీదృశ్యం చూస్తే మరల ఏమి పుట్టి మునిగిందో, మళ్లీ ఏమి అవాంతరం వచ్చిందో అనే భయం కలుగక పోలేదు. పడిపోలేక నిలచిన బండలు త్రోవకి ఆడ్డంగా నిల్చుంటే తప్పుకుంటూ, అలవాటయిన ఆత్రోవని ఆప్రజలంతా నడచి ఆసుందరభవన ప్రాంగాణాన్ని చేరుకున్నారు. కంట్రాక్టరు కామేశం ''ఎందుకొచ్చారు'' అంటూ గర్జించాడు మాట్లాడేది ప్రాణమున్న మానవుల్తో కఠినంగా పడివున్న శిలల్తో కాదని యయినా ఆలోచించకుండా.

యజమానిముందు మాట్లాడేందుకు సూటిగా జవాబిచ్చేందుకు వృద్ధకార్మికు లెవరూ ముందుకు రాలేదు.

చేతులపైవున్న శవాన్నిదించుతూ ముఖంపై గుడ్డ తీసేసి ''ఈత డెవరో మీకు తెలుసా!'' అనిప్రశ్నించాడు చంద్రం.

ఏమిప్రశ్న చొప్పదంటుప్రశ్న. పనిచేసే ప్రతివాడూ యజమానికి తెలియవలసిన అవసరమేముంది అనుకుంది రమ...

''అవును, తెలుసు ... క్రొత్తగా మొన్ననే చనిపోయిన మంగి మొగుడు మల్లయ్యకదూ!''

అవును. మల్లయ్య మీకోసం... మీలాభాలకోసం అనుక్షణం పనిచేస్తూ. మీకోసమే ధనరాసుల్ని కూర్చిపెడుతున్న ఆకూలి... మల్లయ్యే... మొన్న మొన్ననే భార్యచనిపోయి, దిక్కులేని యీపసికూనల్ని తనసంపాదనతో సాకుతూ, తానుపస్తులు పడుకుంటూకూడ మీలాభాలకోసం పనిచేసిన ఆమల్లయ్యే యితను... పిల్లలకి తల్లి కరువయింది. తండ్రికూడా పోయాడు... ఇక ఆపిల్లలంతా దిక్కులేని వాళ్లయారు. వాళ్ల భవిష్యత్తు విషయంగురించి అడిగేందుకేమేము మీదగ్గరికివచ్చాం... అంటూ చంద్రం గుక్కత్రిప్పుకోకుండా చెప్పేసరికి కంట్రాక్టరు కామేశానికి పరిస్థితంగా అర్ధమయింది. అప్పుడతనేంచేసినా ఏమిమాట్లాడినా పరిస్థితులే విషమించవచ్చు... అందుకే పరిస్థితులాలోచించి కామేశం...

''అవును... శవాన్నలాపెట్టుకొని కూర్చోటం ఎందుకు? ప్రస్తుతానికి పదిరూపాయిలు తీసుకొని మల్లయ్య శవానికి అంత్యక్రియలు జరిపించండి. పిల్లల సంగతి నెమ్మదిగా ఆలోచించుకుందాం!''

అవును ఆలోచించుకుందాం... ఎంతకాలమిలా మమ్మల్ని మభ్య పెడతారు కామేశంగారూ! ఎంతకాలమిలా మీమోసాల్ని నమ్ముతూ బ్రతకమంటారు...

''ఏమిటూతలపొగరు?...యిచ్చింది పట్టుకుపోక... పేదల పిల్లల్నందర్ని సాకటానికి యిదేం 'అనాధశరణాలయం' అనుకున్నారా! అంటూగర్జించింది రమ.

రమా! దేవిగారూ! మీరు కొంచం మాప్రసంగంలో కలుగజేసుకోవద్దని మనవి చేస్తున్నాను. గుఱ్ఱాలపందేలకు కుక్కల పెళ్లిళ్లకు మాత్రమే డబ్బు ఖర్చు చేయటం నేర్చుకున్న మీకు మానవమాత్రులమయిన మామీద దయ వుండదని మాకూ తెలుసు. మీకోసం, మీయీజల్సాల కోసం యింత డబ్బు కూర్చి పెడుతున్న మాబోటి పేదవాళ్లపిల్లల కోసం ఒక అనాధాశరణాలయం నడపటం అంతనీచంగా కనుపిస్తుందా మీకు... అవును మీతోబాటే మీరుపుట్టిన రోజే పుట్టిన మా ''కాంతం'' ఒకపూటకుంటే ఒకపూటకు లేక మాతోపాటే రాళ్లు బ్రద్దలుచేసి ఆహారం పుట్టిస్తుంది మీరో... బయటి ప్రపంచం తెలుసుకునే అవసరం లేకుండా నచ్చినప్రతి పనికీ లక్షలుఖర్చు పెడుతున్నారు... మరి మాకు కష్టాలెల్లా తెలుస్తాయి లెండి!!...

అవును నిజమేనోయ్! చంద్రం...సుఖాల్లోనే కాలం గడుపుతూ కష్టాన్నొకనిమిషం కోసమయినా ఆలోచించ లేని మాకు మీకష్టాలు తెలియకపోవడంలో వింతేమీ లేదు. అవును నాన్నగారూ! యిలాంటి ఆపత్సమయాల్లోనే మనం మనక్రిందపనిచేసే యీమానవులకి సహాయం చెయ్యవలసి వుంటుంది...

"శేఖర్! నీపనేదో నీవుచూసుకో యిలాంటి విషయాల్లో అనవసరంగా జోక్యం కలుగజేసికోకు" అని గద్దించాడు. కామేశం...

"అవునన్నయ్యా! మనమిలాంటివసలు పట్టించుకోనే కూడదు. వాడుచూడరాదూ! దమ్మిడీకి కొరగాని వెధవ ఎలా పేల్తున్నాడో!!...

రమాదేవిగారు! మర్యాదయిస్తున్నప్పుడు దక్కించుకోవటం మానవులవిధి. హద్దు మీరు మాట్లాడితే మేమూ తొందర పడవలసి వస్తుంది. నోరు జారినా! చెయి జారినా! తర్వాత ఆలోచించి లాభం వుండదు...

ఆ! ఏమిట్రా! ఏ మన్నావ్! అంటూ రమ చేతిలోని కొరడా జాడించింది. చంద్రం వీపు పై కొరడా కొన పెళ్లు మంది. చంద్రం కళ్లల్లో నీరు తిరిగింది... గుడ్లెర్రబడ్డాయి. దెబ్బ తిన్న ప్రతి రక్తకణం వుజ్వలంగా వేడెక్కి పొంగి పోతూంది...తను వచ్చిన పని, తనకు చిన్న నాటి నుండి నూరి పోయ బడ్డ శాంతం తొందర పడ కుంటూ వెన్నంటు తున్నాయ్.

రమ చెంప పెళ్లు మంది...ఆశ్చర్యంగా చూశారందరూ...

"రమా! చదువు కున్నావే తోటి మానవుణ్ణి, సామాన్య మానవుడుగా నయినా చూడటం నేర్చుకోని నీ చదువెందుకు కాల్చనా!; పరాయి వాడనియైనా, తోటి మానవుడనియయినా, పురుషుడనియయినా ఎంచకుండా కొరడాతో కొట్టడంలో ఎంత తొందర పడ్డావ్! ఎంత మెత్తటి పిల్లులయినా అదే పనిగా సేధిస్తే పెద్ద పులులుగా మార్తాయి తెలుసా!" అంటూనే శేఖర్ తను నిల్చున్న మెట్ల మీంచి దిగివచ్చి "చంద్రం క్షమించవోయ్! డబ్బు ఎక్కించిన మత్తులో, తండ్రి నేర్పిన యిచ్చిన మద్దతుతో దో ఏ తెలియక తప్పుచేసింది" అంటూ చంద్రం చేతులు పట్టు కున్నాడు శేఖరం...





# సర్ జీవన్ శిలాజిత్ లేహ్యాం

హిమాలయా పర్వతమునుంచి తీయబడిన అపూర్వమైనవస్తు. శిలాజిత్‌ను మూలికలతో కలిపి లేహ్యం చేయబడినది. దీన్ని సేవించినయెడల ధృడకాయమూ శక్తియూ నిచ్చును. కడుపునొప్పి, అజీర్ణము మొదలైన రోగములను ఒకటి రెండు రోజులలోనే గుణమునిచ్చును. దగ్గు, ఆయాసము, మూలం, లోపలమూలం, రక్తమూలం, బహుమూత్రము, కడుపులోని గడ్డ, మరియు వాయువినిచే యేర్పడే సమస్తవ్యాధులకు దివ్యౌషధము, విద్యార్థులు సేవించినయెడల జ్ఞాపకశక్తి, చురుకుదనము అధికమాతుంది. స్త్రీలకు:—అక్రమబహిష్టు, మరియు చేయి, కాలు, పట్టుకుండుట, కీలువాయు పక్కశూల మరియు శుక్లములచే ఇతర రోగములకు దివ్యౌషధము. దుర్బలముచే, కృషించిపోయిన బిడ్డలకు ఈమందును ప్రతి రోజు, తెల్లవారి సాయంకాలము ఇచ్చినయెడల కొద్దికాలములోనే ధృడగాత్రులౌతారు. వృద్ధులు సేవించిన శక్తినిచ్చి మంచి దేహారోగ్యమును కాపాడును.

44 రోజుల మందు వెల 5-4-0 22 రోజుల మందు వెల రూ 3-4-0 పోస్టేజి ప్రత్యేకము.

నీలగిరి డిపో, అక్కిపేట చౌక్, బెంగళూరు-2.

శుద్ధమైన నీలగిరి నూనె మా డిపోలలో అడగండి.

అక్కడ చేరిన సమూహమంతో అప్పుడే గుసగుసలు బయదేరాయి

"శేఖరంబాబు ఎంత మంచి వాడురా "అనిదెబ్బ" తిన్న చంద్రం తన చెల్లినేమయినా చేస్తాడని యిదో ఎత్తురా" అంటూ ఏవో తమకు తోచినట్లు చెప్పు కుంటున్నారు...

రమ కొరడా దెబ్బదిన్న బెబ్బులిగా యింట్లోపరికి గత్తింది...

శేఖరం......

ఏమిటి నాన్నా!...

ఏమిటా తలపొగరు: నీవూ కూలి వెధవల్తో చేరి చెల్లెల్ని కొడతావటరా! ఇంత చేసి నీకు యంబి, బియస్ వరకూ చదువు చెప్పించింది యిందుకా! క్రొత్తగాచందూలాల్ కట్టించిన గొప్ప ఆస్పత్రిలో ఛీఫ్ సర్జన్ హోదాలో పనిచేయిద్దామనుకున్న నీ విలాగయిపోవతావటరా! నీగౌరవానికి, నీడిగ్రీకియిది ఎంత అవమాన కరమో ఒక్కసారయి ఆలోచించావటరా !అంటూ గద్దించారు కామేశం...

నాన్నా! కోటి మానవుణ్ణి చేసిన తప్పు క్షమించ మని వేడటమేనా నేను చేసిన తప్పునాన్నా! వైద్య శాస్త్రం సామాన్య మానవుల కందుబాటులో వుండటం కోసంకాని కోటీశ్వరుల ఆస్పత్రులలో కొద్ది మంది కోసం కాదునాన్నా! ఒక వేళ నేను వైద్యం ప్రారంభిస్తే ప్రజల కోసమే ప్రారంభిస్తాను...ముఖ్యంగా యిలాంటి కూలీల కోసమే...

అలాగటరా! నాకే ఎదురు చెప్పేంత వాడి వయ్యావా! పోరా ఆ కూలి వెధవల్తోనే ప్రోరా ఆ కూలి కొంపల్లోనే కొంత కాలంవుంటే కాని తెలిసి రాదురా!"

అవును నాన్నా! ఆ చాలీ చాలని కొంపల్లో, పాప భూయిష్టమయిన శుభ్రంలేని ఆ బజారుల్లో జీవించే కూలీల్తోనే వుంటాను. చదువు కున్నందుకు వాళ్లకు శుభ్రం అంటే ఏమిటో, వాళ్లు ఎలావుంటే హాయిగా ఆనందంగా బ్రతకగలరో నేర్పి జన్మ సార్థకం చేసుకుంటాను. అంత కంటె ఆనంద మయిందింకే ముంటుంది నాన్నా! అంటూ శేఖర్ కట్టుగుడ్డల్తోనే బయలు దేరాడు. చెల్లెలు ఆపేందుకు ఎంతో బ్రతిమాలింది. కాని లాభంలేక పోయింది. తండ్రినానా దుర్భాషలాడాడు ప్రయోజనం కనపడలేదు.

చంద్రంతో వచ్చిన కూలీలంతా ఆశ్చర్యంతో చూస్తున్నారు. "శేఖరంబాబుకి జై" అంటూ సంతోషంతో కేకలు పెట్టారు. కాని కూలీలకు వచ్చిన సంగతి ఏమీ తేల్చి చెప్పకుండానే కామేశం యింట్లోకి పోయి తలుపులు భడాల్ను వేసుకున్నాడు...

"పదండి చంద్రం... ముందు జరుగ వలసిన పని ఆలోచించండి...మల్లయ్య అంత్య క్రియల తర్వాత జరుగ వలసిందాలోచిద్దాం...అంటంతోనే జనసమూహమంతా శవంతో "శేఖరంబాబుకు జై" అంటూ వెనుదిరిగింది. అందరి ముఖాల్లోనూ ఏదో తేజస్సు తొంగి చూస్తుంది...మల్లయ్య చావుతో వ్యాపించిన విచారరేఖలు కొంచం కొంచంగా మాయ మయ్యాయి. కూలీల్తోను, చంద్రంతోను కలిసి శేఖరం నడిచాడు తను యింత కాలం ఈ యిరవై ఏడు సంవత్సారాల లోనూ చవిచూడని క్రొత్త జీవితంలోకి...

కష్టాల్లో కూడా ఆనందంగా వుండగల మనస్తత్వం గల కూలీల్లో ఒక కూలి సోదరుడు తత్వంపాడు తుంటే మిగిలిన వాళ్లంతా వంత పాడుతూ స్మశాన భూమికి నడిచారు...

